క్లుప్తంగా

శ్రీవారి ఆలయ చైర్మన్‌గా శ్రీనివాస్‌గౌడ్



కాప్రా: కుషాయిగూడ శ్రీపద్మావతి వేంకటేశ్వర స్వామి ఆలయ చైర్మన్‌గా సంకూరి శ్రీనివాస్‌గౌడ్ ఎన్నికయ్యారు. గురువారం దేవాదాయశాఖ అధికారి ఆధ్వర్యంలో చైర్మన్‌గా సంకూరి శ్రీనివాస్‌గౌడ్ ప్రమాణస్వీకారం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి హాజరై నూతన చైర్మన్‌కు శుభాకాంక్షలు తెలిపారు. రాజకీయాలకు అతీతంగా ఆలయ అభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. అంతకు ముందు స్వామివారికి ఎమ్మెల్యే సుభాష్‌రెడ్డి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ఈవో వీరేశం, పలువురు బీఆర్‌ఎస్ నాయకులు ఉన్నారు.

ఎర్లీబర్డ్‌ను సద్వినియోగం చేసుకోండి

మల్కాజిగిరి: ఆస్తి పన్ను చెల్లింపుదారులు ఎర్లీబర్డ్ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని మల్కాజిగిరి సర్కిల్ డీసీ రాజు సూచించారు. ఏప్రిల్ 30వ తేదీలోపు ఆస్తి పన్ను ముందస్తు చెల్లించే వారికి 5 శాతం రాయితీ ఉంటుందన్నారు. మల్కాజిగిరి సర్కిల్ కార్యాలయంలో ఈ నెల 7 నుంచి 9వ తేదీ వరకు, ప్రతి ఆదివారం ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేసినట్లు చెప్పారు.

తీరిపల్లి సారయ్యకు దళితరత్న అవార్డు



ఉప్పల్: ఉప్పల్‌కు చెందిన తీరిపల్లి సారయ్యకు దళితరత్న అవార్డును మంత్రి కొప్పుల ఈశ్వర్, ఎస్సీ అభివృద్ధి శాఖ కమిషనర్ యోగితా రానా చేతులమీదుగా రవీంద్ర భారతిలో అందజేశారు. డా.అంబేడ్కర్ జయంతి ఉత్సవాలను పురస్కరించుకుని రాష్ట్రంలో వివిధ సంక్షేమ కార్యక్రమాలు నిర్వహించినందుకు ప్రభుత్వం సారయ్యకు అవార్డును అందజేసినట్లు ఆయన తెలిపారు. మరిన్ని సేవా కార్యక్రమాలతో ముందుకు వెళ్లనున్నట్లు సారయ్య తెలిపారు. తనకు సహకరించిన అధికారులు, కుల పెద్దలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

సీఎం రిలీఫ్ ఫండ్‌తో పేదలకు మేలు

కుషాయిగూడ: సీఎం రిలీఫ్ ఫండ్ పేదలకు ఊరటనిస్తోందని ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి అన్నారు. చిన్నచర్లపల్లికి చెందిన పల్లె శాంతి కుటుంబానికి సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి మంజూరైన రూ.49 వేల చెక్కును గురువారం ఎమ్మెల్యే సుభాష్‌రెడ్డి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అనారోగ్యానికి గురైన పేదలకు సీఎం రిలీఫ్ ఫండ్‌తో పాటు ఎల్‌ఓసీ లెటర్ ఆఫ్ క్రెడిట్ కొండంత భరోసా ఇస్తోందన్నారు. బీఆర్‌ఎస్ నాయకులు ధన్‌పాల్‌రెడ్డి, వెంకటేశ్వర్‌రెడ్డి, గడ్డం రవికుమార్, గిరిబాబు, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

పక్షుల కోసం నీటితొట్టెలు

కుషాయిగూడ: వేసవిలో పక్షులు, మూగజీవాల దాహార్తి తీర్చేందుకు జీహెచ్‌ఎంసీ ఆధ్వర్యంలో చర్లపల్లి డివిజన్‌లో నీటి తొట్టెలు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా రెడ్డికాలనీలో ఏర్పాటు చేసిన నీటి తొట్టెలను స్థానిక కార్పొరేటర్ బొంతు శ్రీదేవి ప్రారంభించారు. డివిజన్ వ్యాప్తంగా వీటిని ఏర్పాటు చేయనున్నట్లు ఆమె తెలిపారు. వెటర్నరీ సిబ్బంది, కాలనీ అసోసియేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

తవ్వారు.. వదిలేశారు..



నాగార్జుననగర్ కాలనీలో నిరసన తెలుపుతున్న స్థానికులు

కుషాయిగూడ: చర్లపల్లి డివిజన్ నాగార్జుననగర్ కాలనీలో నెలకొన్న రోడ్ల సమస్యను తక్షణమే పరిష్కరించాలని స్థానిక కాలనీవాసులు కొందరు విజ్ఞప్తి చేస్తున్నారు. ఈ విషయంపై గురువారం పలువురు మహిళలు, స్థానికులు రోడ్లపైకి వచ్చి ధర్నా చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణం కోసం రోడ్లను తవ్వి తిరిగి మరమ్మతులు చేయకుండా వదిలేయడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని అన్నారు. తవ్విన రోడ్లపై గుంతల్లో నీరు నిలిచి దుర్వాసన వెదజల్లుతోందని, గుంతల రోడ్లపై నడవలేకపోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా సంబంధిత మున్సిపల్ అధికారులు స్పందించి తమ సమస్యలు పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో కాలనీవాసులు రవీందర్‌గౌడ్, జంపయ్య, యాదగిరి, మల్లేష్, గణేష్, లక్ష్మారెడ్డి, బాలమణి, పద్మ, లక్ష్మీ, నర్సమ్మ, ఉమ, వీణ, లావణ్య, అనురాధ తదితరులు ఉన్నారు.

బురదజల్లే ప్రయత్నం: కార్పొరేటర్ బొంతు శ్రీదేవి

నాగార్జునగర్ కాలనీలో రోడ్ల నిర్మాణం కోసం రూ.92 లక్షలు మంజూరయ్యాయని, త్వరలోనే పనులు ప్రారంభించనున్నామని స్థానిక కార్పొరేటర్ బొంతు శ్రీదేవి అన్నారు. ఉదయం జరిగిన ధర్నా విషయంపై సాయంత్రం ఆమె స్పందిస్తూ.. కొందరు కావాలనే తనపై బురద జల్లే ప్రయత్నంలో భాగంగానే ఇలా ధర్నాలు చేయిస్తున్నారని ఆరోపించారు. రాజకీయంగా తనను అణగదొక్కేందుకు ఇంటింటికీ తిరిగి లేనిపోని ఆరోపణలతో సమస్యలు సృష్టించి కాలనీవాసులపై ఒత్తిడి తెచ్చి ధర్నాలు చేయించడం ఏంటని ఆమె ప్రశ్నించారు. రోడ్ల నిర్మాణం కోసం గతనెల 30వ తేదీన నిధులు మంజూరైన విషయం కాలనీ అసోసియేషన్ ప్రతినిధులతో పాటు అందరికీ తెలుసు అన్నారు. ఓ మహిళా కార్పొరేటర్ అయిన తన ప్రతిష్ఠను ఎలాగైనా అభాసుపాలు చేయాలని ఓ వ్యక్తి ఇలా వ్యవహరిస్తున్నాడని తెలిపారు. సదరు వ్యక్తి గతంలోనూ ఎన్నో ప్రయత్నాలు చేసినా పట్టించుకోలేదని, ఇకపై ఊరుకునే సమస్యే లేదని ఆమె స్పష్టం చేశారు. ఇలాంటివి మరోసారి పునరావృతమైతే సదరు వ్యక్తికి ఇకపై మాటలు ఉండవు, చేతలతో చూపిస్తామని హెచ్చరించారు.

ఇఫ్తార్ విందులతో సోదరభావం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే సుభాష్‌రెడ్డి చిత్రంలో రాచకొండ సీపీ డీఎస్ చౌహాన్

హబ్సిగూడ: రంజాన్ పవిత్ర మాసంలో ఇఫ్తార్ విందులు హిందూ ముస్లింల మధ్య సోదరభావాన్ని పెంపొందిస్తాయని ఉప్పల్ ఎమ్మెల్యే బేతి సుభాష్ రెడ్డి అన్నారు. హబ్సిగూడ డివిజన్ పరిధిలోని కుతుబ్ షాహీ మసీద్–ఈ–ఏక్‌మినార్ మసీదులో గురువారం సాయంత్రం ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందుకు ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి, రాచకొండ పోలీస్ కమిషనర్ డీఎస్ చౌహాన్ హాజరయ్యారు. ఏసీపీ నరేష్‌రెడ్డి, కార్పొరేటర్లు కక్కిరేని చేతనహరీష్, బన్నాల గీతప్రవీణ్‌ముదిరాజ్, నిర్వాహకులు మసీద్ అధ్యక్షులు అల్‌హాస్ ఖాజా మోయినుద్దీన్, డాక్టర్ మగ్దుమ్ హుస్సేన్, అల్తాఫ్ సయ్యద్ అలీ, జాంగీర్, సాబీర్ పాషా, ఫరూక్ షేక్ అబ్దుల్, రియాజ్, రెహమాన్, బీఆర్‌ఎస్ నాయకులు గడ్డం రవికుమార్, గరిక సుధాకర్, బన్నాల ప్రవీణ్‌ముదిరాజ్, ఇర్షద్‌ఖాన్, ఫరూక్ తదితరులు పాల్గొన్నారు.

నేరాల అదుపులో సీసీ కెమెరాల పాత్ర కీలకం



దీన్‌దయాల్‌నగర్‌లో సీసీ కెమెరాల ఏర్పాటు ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు

అల్వాల్: నేరాల అదుపునకు సీసీ కెమెరాలు ఎంతో ఉపయోగపడతాయని మల్కాజిగిరి ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు అన్నారు. వెస్ట్ దీన్‌దయాళ్‌నగర్ వెల్ఫేర్ అసోషియేషన్ ఆధ్వర్యంలో గురువారం ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేరాలను అదుపు చేసేందుకు సీసీ కెమెరాలు ఎంతో దోహదం చేస్తాయన్నారు. ప్రతి కాలనీ సంక్షేమ సంఘాల వారు సీసీ కెమెరాల ఏర్పాటులో భాగస్వాములు కావాలన్నారు. కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ రాజ్యలక్ష్మీ, నేరేడ్‌మెట్ సీఐ నర్సింహస్వామి, ఎస్‌ఐ బాలస్వామి తదితరులు పాల్గొన్నారు.

కంటి వెలుగును సద్వినియోగం చేసుకోవాలి



కళ్లద్దాలను పెడుతున్న మేయర్ బుచ్చిరెడ్డి

బోడుప్పల్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని బోడుప్పల్ మేయర్ సామల బుచ్చిరెడ్డి అన్నారు. 22వ డివిజన్‌లోని న్యూ హేమానగర్ కమ్యూనిటీ హాల్‌లో గురువారం కంటి వెలుగు రెండో విడత కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 13వ తేదీ వరకు కంటి పరీక్షలు నిర్వహిస్తారన్నారు. అవకాశాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్పొరేటరు బొమ్మక్ సుగుణ, దొంతరబోయిన మహేశ్వరి, సీనియర్ నాయకులు బొమ్మక్ బాలయ్య, కృపాసాగర్ ముదిరాజ్, వైద్య అధికారులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ఒత్తిడిలేని చదువులు ముఖ్యం

కాప్రా: ఒత్తిడిలేని బోధనా విధానంతో విద్యార్థులకు వివిధ రకాల పోటీ పరీక్షలు నిర్వహిస్తే వారిలో ఉన్న ప్రతిభను వెలికితీయవచ్చని రవీంద్రభారతీ స్కూల్ డీన్ శ్రీలత అన్నారు. గురువారం రాష్ట్ర, జిల్లాస్థాయి సీవీ రామన్ టాలెంట్ టెస్ట్‌లో రవీంద్ర భారతీ స్కూల్ విద్యార్థులు మొదటి ర్యాంకు సాధించారు. ఈ సందర్భంగా తమ స్కూల్ విద్యార్థులను అభినందిస్తూ ప్రశంసపత్రాలను అందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, స్కూల్ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

త్వరలో ఆర్‌వోబీని ప్రారంభిస్తాం



కుషాయిగూడ: చర్లపల్లిలో రైల్వే రోడ్డు కం ఓవర్ బ్రిడ్జిని గురువారం ఎమ్మెల్యే సుభాష్‌రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కోట్లాది రూపాయలు వెచ్చించి నిర్మించిన ఈ ఆర్‌వోబీని త్వరలో ప్రారంభిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ ధన్‌పాల్‌రెడ్డి, నాయకులు జనుంపల్లి వెంకటేశ్వర్‌రెడ్డి, గడ్డం రవికుమార్, సుధాకర్, దప్పు గిరిబాబు, అనిల్, ప్రభాకర్‌రెడ్డి, పద్మారెడ్డి, చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు.

దళితుల భూములు గుంజుకోవద్దు



మాట్లాడుతున్న రాపోలు రాములు

బోడుప్పల్: ప్రభుత్వం ఎలాంటి ఆర్డర్, జీవో గానీ లేకుండా బోడుప్పల్ నగర పాలక సంస్థ పరిధిలో ఉన్న 336 ఎకరాల దళితుల భూములను గుంజుకునే ప్రయత్నం చేస్తోందని తెలంగాణ రాష్ట్ర అంబేడ్కర్ సంఘాల సమాఖ్య అధ్యక్షుడు రాపోలు రాములు అన్నారు. బోడుప్పల్‌లోని శ్రీగట్టు మైసమ్మ దేవాలయంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 1957 సంవత్సరంలో కాంగ్రెస్ ప్రభుత్వం సర్వే నంబర్–63లో (పెద్ద కంచె) 61 దళిత కుటుంబాలకు వ్యవసాయం చేసుకునేందుకు ఇచ్చిందన్నారు. 1977 సంవత్సరంలో అసైన్డ్ భూముల చట్టం వచ్చిందని, మా భూములు ఆ చట్టం పరిధిలోకి రావన్నారు. ఉప్పల్ భగాయత్ మాదిరిగా ఎకరానికి వెయ్యి గజాల స్థలం ఇవ్వాలని, లేనిపక్షంలో ప్రభుత్వం మా భూమి జోలికి రావొదన్నారు. దళితులను రెండు గ్రూపులుగా మంత్రి మల్లారెడ్డి విడగొట్టి మోసం చేసే ప్రయత్నం చేస్తున్నారన్నారు. ప్రజా సంక్షేమానికి ప్రభుత్వం మా భూములు తీసుకోవాలంటే జీవో తీసి మాకు నోటీసులు పంపించి అందరి ఆమోదం పొందిన తర్వాతే తీసుకోవాలన్నారు. అలా కాకుండా మంత్రి మల్లారెడ్డి ఇష్టమొచ్చినట్లు చేస్తానంటే ఆయన రాజకీయ పతనం బోడుప్పల్ నుంచే ప్రారంభం అవుతుందన్నారు. తెలంగాణ రాష్ట్ర భూపరిరక్షణ సమితి అధ్యక్షుడు మైసయ్య, దళిత నేతలు రాపోలు చిన్న కిష్టయ్య, నత్తి మైసయ్య, మైసగల్ల బాలయ్య, రాపోలు శ్రీరాములు, జానీకుమార్, రాపోలు రమేష్, చిలుకా స్వామి పాల్గొన్నారు.

ఘనంగా బీజేపీ ఆవిర్భావ దినోత్సవాలు



ఆవిర్భావ ఉత్సవంలో మాజీ ఎమ్మెల్యే ఎన్‌వీఎస్‌ఎస్ ప్రభాకర్



బోడుప్పల్‌లో బీజేపీ జెండాను ఎగురవేస్తున్న శివయాదవ్

బీజేపీ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని గురువారం పెద్దఎత్తున సంబురాలు జరుపుకున్నారు. పలుచోట్ల జెండాలను ఆవిష్కరించారు. రాష్ట్రంలో రానున్న రోజుల్లో బీజేపీ అధికారంలోకి రానుందని, ప్రతి ఒక్కరూ కష్టపడి పనిచేసి బీజేపీని అధికారంలోకి తీసుకురావాలని పలువురు రాష్ట్రస్థాయి నేతలు సూచించారు.



చర్లపల్లి డివిజన్‌లో బీజేపీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు



మల్కాజిగిరి చౌరస్తాలో జెండా ఆవిష్కరిస్తున్న కార్పొరేటర్ శ్రవణ్



మల్కాజిగిరి ఇంటింటికీ బీజేపీ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న జిల్లెల రవియాదవ్



వినాయక్‌నగర్‌లో వేడుకలు



పీర్జాదిగూడలో జెండా ఆవిష్కరిస్తున్న పీఎంసీ అధ్యక్షుడు నమిలికొండ అనిల్‌రెడ్డి

మున్నూరు కాపులు రాజకీయంగా ఎదగాలి



సభ్యత్వ నమోదులో సర్దార్ పుటం పురుషోత్తమ్ పటేల్

మేడిపల్లి: మున్నూరు కాపులు రాజకీయంగా, ఆర్థికంగా, సామాజికంగా ఎదగాలని కుల సంఘాల చెబుతాయి కానీ వారి ఎదుగుదలకు ఎటువంటి ప్రణాళికలు రూపొందించడం లేదని మున్నూరు కాపు మహిళా మాక్స్ సొసైటీ ఉన్నత కార్యనిర్వాహణ అధికారి సర్దార్ పుటం పురుషోత్తమ్ పటేల్ అన్నారు. పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని పోరెడ్డి శ్రీనివాస్ నివాసంలో మున్నూరు కాపు సంఘం సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మున్నూరు కాపు మాక్స్ సొసైటీ ఆధ్వర్యంలో ప్రణాళికాబద్ధంగా ప్రణాళికలు రూపొందించి సంఘం ఆర్థికంగా ఎదిగేందుకు కృషి చేస్తున్నామని అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 45 వేల మందిని సభ్యులుగా చేర్చే కార్యక్రమం ప్రారంభమైందన్నారు. డైరెక్టర్లు పోరెడ్డి జయశ్రీనివాస్ పటేల్, చిందం ఇందిర మహేందర్ పటేల్, మట్టి మంజుల బాల్‌రాజు పటేల్, అయ్యగారి విజయలక్ష్మి పటేల్, మామిడి శేఖర్‌పటేల్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల్లో నాణ్యత పాటించాలి



సీసీ రోడ్డు పనులు పరిశీలిస్తున్న కార్పొరేటర్ శ్రీవాణి వెంకట్రావ్

రామంతాపూర్: చిన్న జెండాబస్తీలో రూ.27 లక్షలతో చేపట్టిన సీసీ రోడ్డు పనులను కార్పొరేటర్ బండారు శ్రీవాణి వెంకట్రావ్ గురువారం అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అభివృద్ధి పనుల్లో నాణ్యత లోపిస్తే కాంట్రాక్టర్లపై అధికారులపై చర్యలు తప్పవని, అదే విధంగా అభివృద్ధి పనులు జరుగుతున్నప్పుడు స్థానిక సంక్షేమ సంఘాల నేతలు పర్యవేక్షించాలని సూచించారు. కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ అధికారులు డీఈ నాగమణి, వర్క్ ఇన్‌స్పెక్టర్ మహేందర్‌తో పాటు బీజేపీ డివిజన్ అధ్యక్షుడు బండారు వెంకట్రావ్, మహ్మద్ ముస్తాక్, కుమారస్వామి, దానయ్య, ఆనంద్, శంభు లింగం తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌ఎఫ్‌సీ ఉద్యోగి ఆత్మహత్య



శివ(ఫైల్)

కుషాయిగూడ: ఆన్‌లైన్ గేమింగ్‌తో ఆర్థికంగా నష్టపోయి మానసిక ఒత్తిడితో ఎన్‌ఎఫ్‌సీ ఉద్యోగి ఆత్మహత్య చేసుకున్న ఘటన గురువారం కుషాయిగూడ పీఎస్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. ఎన్‌ఎఫ్‌సీలో ఉద్యోగి వరద శివ(31) ఈసీఐఎల్ డీఏఈ కాలనీలో నివాసం ఉంటున్నాడు. శివకు భార్య ప్రభాతి, ఏడాదిన్నర కొడుకు వేదాంష్ ఉన్నారు. శివకు ఆన్‌లైన్ గేమింగ్ ఆడే అలవాటు ఉంది. దీంతో భారీగా డబ్బులు పెట్టుబడి పెట్టాడు. డబ్బులు తిరిగిరాకపోవడంతో తీవ్ర మానసిక ఒత్తిడి లోనయ్యాడు. ఇదిలా ఉండగా ఈ నెల 2న భార్య ప్రభాతికి పంటినొప్పి ఎక్కువగా ఉండటంతో గద్వాల్‌లోని ఆమె తల్లిదండ్రుల ఇంటి వద్ద విశ్రాంతి తీసుకునేందుకు పంపాడు. తిరిగి అదేరోజు రాత్రి ఇంటికి చేరుకున్నాడు. భార్య ప్రభాతి తిరిగి 5వ తేదీన డీఏఈ కాలనీ ఇంటికి తిరిగి వచ్చింది. ఇంటి తలుపులు తెరవకపోవడంతో సెక్యూరిటీ గార్డును పిలిచి తలుపులు బద్దలు కొట్టించింది. లోనికి వెళ్లగా ఫ్యాన్‌కు ఉరివేసుకుని వేలాడుతున్న భర్తను చూసి షాక్‌కు గురైంది. అక్కడే సూసైడ్ నోట్ లభించింది. సారీ.. వేదాంష్ నేను నీ కోసం ఏమీ చేయలేకపోతున్నా, నా మెదడుని నేను కంట్రోల్ చేసుకోలేకపోతున్నా, నా చావుకి నేనే కారణం, కుటుంబ సభ్యులందరూ క్షమించండి అంటూ సూసైడ్ నోట్‌లో రాసుంది. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

అంజనీపుత్ర.. అభయాంజనేయ..



చర్లపల్లి హనుమాన్ ఆలయంలో ఎమ్మెల్యే భేతి సుభాష్‌రెడ్డి

వీర హనుమాన్ జయంతిని పురస్కరించుకొని గురువారం అన్ని ప్రాంతాల్లో పెద్దఎత్తున పూజలు, ర్యాలీలు నిర్వహించారు. ఆయా ప్రాంతాల్లోని ఉత్సవ కమిటీల ఆధ్వర్యంలో అన్ని ఏర్పాట్లు చేశారు. కొన్ని ప్రాంతాల్లో ఎటు చూసినా కాషాయ జెండాలతో ఆ ప్రాంతాలు శోభను సంతరించుకున్నాయి. పెద్దఎత్తున యువత పాల్గొని శోభాయాత్రను శోభాయమానంగా నడిపించారు. జైశ్రీరామ్, జైహనుమాన్ నినాదాలతో ఆ ప్రాంతాలు మార్మోగాయి.



ఎన్‌జీఆర్ఐ అభయాంజనేయ స్వామి ఆలయంలో ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి



హబ్సిగూడలో హనుమాన్ విజయోత్సవ ర్యాలీలో రాగిడి లక్ష్మారెడ్డి తదితరులు



అల్వాల్‌లో హనుమాన్ చాలీసా పారాయణం



మౌలాలిలో హనుమాన్ జయంతి ఉత్సవాలు



హబ్సిగూడలో హనుమాన్ జయంతిలో కార్పొరేటర్ చేతన



మల్లాపూర్‌లో హనుమాన్ జయంతి వేడుకల్లో కార్పొరేటర్ దేవేందర్‌రెడ్డి



నేరేడ్‌మెట్‌లో కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు నందికంటి శ్రీధర్



యాదవనగర్‌లో అన్నదానంలో కార్పొరేటర్ మేకల సునీతయాదవ్